ఐకమత్యంతో ముందుకు..

- ఆదర్శంగా శ్రీకృష్ణ యువజన సేవా సంఘం
- సీతంపేట అభివృద్ధికి సమష్టి కృషి
- నేడు సంఘ 10వ వార్షికోత్సవం


సంఘం అభివృద్ధి చేసిన గ్రామదేవతల ఆలయం


శ్రీకృష్ణ యువజన సేవా సంఘం పాలక వర్గ సభ్యులు

సీతంపేట: ఎవరో వస్తారని.. ఏదో చేస్తారని ఎదురు చూడకుండా తమ ప్రాంత అభివృద్ధికి సీతంపేట వాసులు ఐకమత్యంతో ముందుకు సాగుతున్నారు. శ్రీకృష్ణ యువజన సేవా సంఘం పేరిట 2013లో గ్రామ సంఘంగా ఏర్పడ్డారు. అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులతో పాలక వర్గాన్ని నియమించుకున్నారు. తమ ప్రాంతానికి ఏయే వసతులు కావాలి.. సమస్యలు ఏవిధంగా పరిష్కరించుకోవాలో ప్రణాళిక రచించి నాటి నుంచి సమష్టిగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నారు. సీతంపేటకు అవసరమైన రహదారులు, డ్రెయిన్లు, కుళాయిలు, వీధిలైట్లు ఇలా ప్రతి ఒక్కటి సంఘ సభ్యులు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లి సాధించుకున్నారు. సంఘం స్థాపించి ఈ నెల 29వ తేదీ నాటికి పదేళ్లు పూర్తి చేసుకుంటోంది. ఈ దశాబ్ద కాలంలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తూ చక్కని గ్రామ సంఘంగా పలువురికి ఆదర్శంగా సభ్యులు నిలిచారు.

కీలక పాత్రధారులకు సన్మానం

అభివృద్ధి, సేవాపథంలో పయనిస్తున్న శ్రీకృష్ణ యువజన సేవా సంఘం 10వ వార్షిక మహోత్సవం శనివారం సాయంత్రం కనకమ్మ ఆలయం వద్ద సంఘం నిర్మించిన ఎస్‌కేవైఎస్‌ఎస్‌ కల్యాణ మండపంలో జరపనున్నారు. ఈ సందర్భంగా సీతంపేట అభివృద్ధికి సంఘ కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషించిన సంఘ అధ్యక్షుడు బోర ఈశ్వరరావు, కార్యదర్శి సారిపిల్లి గంగరాజు, కోశాధికారి బోర వెంకటరమణలను ఘనంగా సన్మానించనున్నారు. పాలక వర్గం, సీతంపేట వాసుల సమక్షంలో వీరిని సత్కరించడానికి సన్నాహాలు పూర్తి చేశారు.

సంఘ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు

- సీతంపేటలో సీతారాముల ఆలయం లేనందున ఈ ప్రాంతానికి ముఖద్వారం నిర్మించి ప్రజల కోరిక నెరవేర్చారు.
- 2013కి ముందు సాదాసీదాగా ఉన్న గ్రామదేవత కనకమ్మ ఆలయాన్ని గ్రానైట్‌ ఫ్లోరింగ్‌, గుడిపైన అష్టలక్ష్ములతో అందంగా తీర్చిదిద్దారు.
- స్థానికుల కోరిక మేరకు గురుద్వారా జంక్షన్‌ వద్ద గ్రామదేవతలు కనకమ్మ, భూలోకమాత, పైడిమాంబ విగ్రహాలతో ముఖద్వారం, దుర్గాగణపతి ఆలయం వైపు శ్రీకృష్ణుడు, అయ్యప్పస్వామి విగ్రహాలతో యదువంశీ ముఖద్వారం ఏర్పాటు చేశారు.
- శిథిల స్థితిలో ఉన్న పాత సంఘం భవనాన్ని సంఘ సమావేశాలు జరుపుకోవడానికి వీలుగా రెండంతస్తుల భవనంగా తీర్చిదిద్దారు.
- స్థానిక శ్మశానవాటికను ప్రజాప్రతినిధుల సాయంతో సౌకర్యవంతంగా అభివృద్ధి చేశారు. కోస్ట్‌ ఐరన్‌ దహన వాటికలు, షెడ్‌లు నిర్మించారు. మరో రెండు ఐరన్‌ బెడ్లు, శ్మశానవాటికను ఉద్యానవనంగా తీర్చిదిద్దడానికి ప్రజాప్రతినిధుల ద్వారా రూ.16 లక్షల నిధులు మంజూరు చేయించారు.
- గ్రామదేవత ఆలయం ముందు శ్రీకృష్ణుని విగ్రహంతో గోకుల్‌ పార్కు నిర్మించారు.
- ఈ ప్రాంత వాసుల మధ్య ఐకమత్యం పెంపొందించేలా ఏటా వన సమారాధనలు, శ్రీరామనవమి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.
- సంఘం ఆధ్వర్యంలో ఏటా గ్రామదేవతల పండగలు భారీ ఎత్తున నిర్వహిస్తూ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందేలా కొనసాగిస్తున్నారు.


సీతంపేటలో సంఘం నిర్మించిన రెండంతస్తుల కార్యాలయ భవనం, కల్యాణ మండపం

విశాలమైన కల్యాణ మండపం

సీతంపేటలో ఏ శుభకార్యమైన చేసుకోవడానికి సరైన సదుపాయం లేక రోడ్డుపైన జరుపుకోవాల్సిన పరిస్థితి ఉండేది. నివాసుల కోరిక మేరకు దాతలు, ఇతర సభ్యుల సహకారంతో కనకమ్మ ఆలయం పక్కనే ఉన్న స్థలంలో మూడంతస్తుల విశాలమైన కల్యాణ మండపం నిర్మించారు. ఈ స్థలాన్ని కొంత మంది స్వార్థపరులు ఆక్రమించుకోవాలని ప్రయత్నించగా.. సంఘం సమష్టిగా పోరాడి కోర్టులో కేసును నెగ్గి స్థలాన్ని స్వాధీనం చేసుకుని కల్యాణ మండపం నిర్మించారు.

సీతంపేట వాసుల సహకారం



సీతంపేట వాసులు అందించిన సహకారంతో సంఘం ద్వారా ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాం. సంఘ భవనాన్ని రెండంతస్తులుగా అభివృద్ధి చేశాం. గ్రామదేవతల ఆలయం, గోకుల్‌ పార్కు, ముఖద్వారాలు, కల్యాణ మండపం నిర్మించాం. భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి పనులు చేయాలని సంకల్పించాం.

– బోర ఈశ్వరరావు, సంఘ అధ్యక్షుడు

శ్మశానవాటిక అభివృద్ధి



సీతంపేటకు చెందిన శ్మశానవాటిక గురుద్వారా జంక్షన్‌లో ఉంది. అక్కడ సరైన సదుపాయాలు లేక మృతులకు చేయాల్సిన కార్యక్రమాలకు ఇబ్బంది పడేవారు. ప్రజాప్రతినిధుల సాయంతో ఐరన్‌బెడ్‌, షెడ్లు నిర్మించాం. ఈ వాటికను ఉద్యానవనంగా తీర్చిదిద్దడానికి రూ.16 లక్షల నిధులు సాధించగలిగాం.

– సారిపిల్లి గంగరాజు, ప్రధాన కార్యదర్శి

కష్టాల్లో ఉన్న వారికి అండ



ఎవరికి ఏ కష్టం వచ్చినా సంఘం అండగా ఉంటుంది. కుటుంబ తగాదాలు, భార్యాభర్తల తగాదాలు, ఆస్తి తగాదాలు ఇలా ఏదైనా సంఘం దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తాం. పేద కుటుంబాల్లో ఎవరైనా చనిపోయినా, వివాహాలు జరిగినా సాయం అందిస్తాం. ప్రతి రోజూ కనకమ్మ ఆలయం వద్ద పాలక వర్గం అందుబాటులో ఉంటూ సీతంపేట వాసుల సమస్యలు పరిష్కరిస్తోంది.

– బోర వెంకటరమణ, కోశాధికారి

క్లుప్తంగా

పరిశుభ్రంగా 50వ వార్డు


పారిశుధ్య కార్మికులకు కొబ్బరి నూనె అందిస్తున్న కార్పొరేటర్‌ వావిలపల్లి ప్రసాద్‌

మద్దిపాలెం: జీవీఎంసీ 50వ వార్డు కార్యాలయంలో శుక్రవారం పనిముట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పారిశుధ్య కార్మికులకు కార్పొరేటర్‌ వావిలపల్లి ప్రసాద్‌ ప్రభుత్వం అందించిన చీపుర్లు, పారలు, వారి ఆరోగ్యం దృష్ట్యా ఒక్కొక్కరికీ 4 లీటర్లు కొబ్బరి నూనెను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని వార్డులో ప్రతి ప్రాంతానికి సంబంధించి మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా సెక్రటరీలు జాగ్రత్తలు వహించి వార్డును పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ సుధాకర్‌, శానిటరీ సూపర్‌వైజర్లు చిరంజీవి, సింహాచలం, సచివాలయ శానిటేషన్‌ కార్యదర్శులు పార్వతి, శోభారాణి, ప్రదీపిక తదితరులు పాల్గొన్నారు.

కొండవాలు ప్రాంతాల్లో వీధిలైట్ల ఏర్పాటు


వరాహగిరి కాలనీలో విద్యుత్‌ లైట్లు ఏర్పాటు చేస్తున్న జీవీఎంసీ సిబ్బంది

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు కొండవాలు ప్రాంతాల్లో విద్యుద్దీపాలను ఏర్పాటు చేశారు. వరాహగిరి కాలనీ, సింహగిరి కాలనీ, సత్యసాయినగర్‌ ప్రాంతాల్లో చీకట్లు అలుముకోవడంతో ఈ సమస్యను స్థానికులు, కాలనీ నాయకులు జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్‌ లీడర్‌, కార్పొరేటర్‌ కంపా హనోకు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సుమారు రూ.2.95 లక్షలను నిధులు మంజూరు చేయించి, ఈ పనులకు గతంలో శంకుస్థాపన చేశారు. ముందుగా వరాహగిరి కాలనీ, సింహగిరి కాలనీల్లో ఎలక్ట్రిసిటీ విభాగం అధికారులు 13 విద్యుత్‌ స్తంభాలు ఏర్పాటు చేశారు. వీటికి జీవీఎంసీ సిబ్బంది శుక్రవారం లైట్లను అమర్చారు. వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, సత్యసాయినగర్‌ కాలనీ అధ్యక్షుడు కారుకొండ రాజు, పార్టీ శ్రేణులు సన్యాసప్పలనాయుడు, నేపాల్‌ శ్రీను దగ్గరుండి పనులను పూర్తి చేయించారు.

ఎన్‌ఎస్‌టీఎల్‌ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు

గోపాలపట్నం: జాతీయ సాంకేతిక దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల, కళాశాలల పరిధి 9, 10 తరగతులు, ఇంటర్‌, ఇంజినీరింగ్‌, పాలిటెక్నిక్‌ విద్యార్థులకు ఎన్‌ఎస్‌టీఎల్‌లో పోటీలు నిర్వహిస్తున్నట్లు సంస్థ అధికారులు తెలిపారు. మే నెల 9, 10 తేదీల్లో ఉత్పత్తులు, మల్టీమీడియా ప్రదర్శన ఉంటుందన్నారు. ఇంటిగ్రేటెడ్‌ ఎప్రోచ్‌ ఇన్‌ సైన్స్‌ అండ్‌ టెక్నాలజీ ఫర్‌ సస్టయిన్‌బుల్‌ ఫ్యూచర్‌ అనే అంశంపై నమూనాల పోటీ జరుగుతుందని చెప్పారు. పోటీలో పాల్గొనే విద్యార్థులు ప్రదర్శించనున్న నమూనాల వివరాలను ఆయా స్కూళ్లు, కాలేజీల ప్రిన్సిపాళ్లు మే 3లోగా సంస్థకు పంపించాలని సూచించారు. వివరాలకు 94902 32433, 93963 67120, 85390 88872 నంబర్లలో సంప్రదించాలని కోరారు. ఎంపికైన నమూనాలను 9, 10 తేదీల్లో జరిగే ఎగ్జిబిషన్‌లో ప్రదర్శిస్తామని అధికారులు తెలిపారు.

ఘనంగా గోరింటాకు వేడుక

మురళీనగర్‌: కప్పరాడ ఎన్‌జీజీవోస్‌ కాలనీలోని వైభవ వేంకటేశ్వర స్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం గోరింటాకు వేడుక ఘనంగా నిర్వహించారు. ముందుగా వైభవుడికి, అనంతరం శ్రీదేవి, భూదేవిలకు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం అమ్మవార్లకు, వనితలకు గోరింటాకు వేడుక నిర్వహించారు. భక్తులు పాల్గొని వేడుకను తిలకించారు. ఆలయ అర్చకులు శేషాచార్యులు, వాసుదేవాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల ఏర్పాట్లను ఆలయం ఈవో బండారు ప్రసాద్‌ పర్యవేక్షించారు.

మొక్కలతో పచ్చదనం


రైల్వే న్యూకాలనీలో చలివేంద్రం ప్రారంభిస్తున్న కార్పొరేటర్‌ ఆళ్ల లీలావతి

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు రైల్వే న్యూకాలనీలో శుక్రవారం కార్పొరేటర్‌ ఆళ్ల లీలావతి ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. రైల్వే న్యూకాలనీ ప్రధాన రహదారిలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు, పర్యావరణాన్ని కాపాడేందుకు ఆమె మొక్కలు నాటారు.

చలివేంద్రం ప్రారంభం..

అనంతరం మసీదు జంక్షన్‌ ప్రాంతంలో వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు రైల్వే న్యూకాలనీ వర్తక సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మజ్జిగ పంపిణీ చేసి కార్పొరేటర్‌ లీలావతి ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నగర కార్యదర్శి ఆళ్ల శ్రీనివాస్‌, రాము, సక్కుబాయ్‌, లియాఖత్‌, అబ్దుల్లా, షాజహాన్‌, కనకమహాలక్ష్మి, ఖాన్‌ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కర్ణాటక గాత్ర కచేరీ


కీర్తనలు ఆలపిస్తున్న దువ్వూరి శృతి

సీతంపేట: లలితానగర్‌ లలితా పీఠంలో శుక్రవారం నిర్వహించిన కర్ణాటక సంగీత గాత్ర కచేరీ ఆహుతులను అలరించింది. ద్వారం త్యాగరాజు శిష్యురాలు దువ్వూరి శృతి పలు కీర్తనలు ఆలపించి ఆకట్టుకున్నారు. వాలాజి వరణం, శ్రీ గణేశ్వర, జననీనినువిన, నూదు మహిమ, అనుపమ గుణాంబుధి, లలితే భైరవి, శ్రీచక్రరాజ, రేవతి తిల్లాన కీర్తనలు భక్తులను పరవశింపజేశాయి. ఈమెకు కోటా గాయత్రి వరేణ్య వయోలిన్‌పై, తాలాడ చైతన్య మృదంగంపై వాద్య సహకారం అందించారు. లలితా పీఠం మేనేజర్‌ మన్నవ కృష్ణసేన్‌ గాయని శృతిని అభినందించి సత్కరించారు.

పథకాలతో అన్ని వర్గాలకు మేలు


కరపత్రం అందిస్తున్న కె.కె.రాజు, ఉషశ్రీ

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డు యలమంచిలి వారి వీధిలో శుక్రవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు, కార్పొరేటర్‌ పెద్దిశెట్టి ఉషశ్రీతో కలిసి ఇంటింటికీ వెళ్లి జగనన్న పాలనలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను స్థానికులకు వివరించారు. ప్రజాభిప్రాయాలు సేకరించి కరపత్రాలు పంచారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న ప్రజా సంక్షేమ పాలనపై ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా సంక్షేమ పథకాలు, అభివృద్ధి, విద్య, వైద్యం చేరువ చేశారన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి, మహిళల సాధికారతకు నిరంతరం శ్రమిస్తున్న జగనన్న వెంట ప్రజలంతా ఉండాలని, మళ్లీ ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దుప్పలపూడి శ్రీనివాసరావు, బైర వెంకట్‌, జక్కంపూడి సత్యనారాయణ, తిరుపతిరావు, గంగామహేష్‌, హరిపట్నాయక్‌, పారుపల్లి రవి, పద్మాశేఖర్‌, జేసీఎస్‌ మండల కన్వీనర్‌ బులుసు జగదీష్‌, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

పక్కి దివాకర్‌ కుటుంబానికి పరామర్శ


పక్కి దివాకర్‌ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, కోలా గురువులు

కంచరపాలెం: ఇటీవల మరణించిన రాష్ట్ర బీసీ కమిషన్‌ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్‌ నాయకుడు పక్కి దివాకర్‌ కుటుంబ సభ్యులను మద్దిపాలెంలోని స్వగృహంలో శుక్రవారం రాష్ట్ర బీసీ సెల్‌ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్‌ చైర్మన్‌ కోలా గురువులు పరామర్శించారు. దివాకర్‌ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీకి, బీసీ అధ్యయన కమిటీకి దివాకర్‌ చేసిన సేవలను గుర్తు చేశారు. అందరితో కలిసికట్టుగా ఉంటూ అనేక సేవలందించిన దివాకర్‌ను కోల్పోవడం పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. జిల్లా బీసీ సెల్‌ అధ్యక్షుడు మన్యాల శ్రీనివాస్‌, సీనియర్‌ నాయకులు కోటాన రాము, రామన్న పాత్రుడు, సత్యాల సాగరిక, సత్యాల వెంకట్‌, అప్పారావు, బొండాడ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సాయి సత్య వ్రతం


పంచామృతాభిషేక సేవలో సాయినాథుడు


సామూహిక సాయి సత్య వ్రతంలో పాల్గొన్న భక్తులు

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు రామకృష్ణానగర్‌లోని షిర్డీసాయి ధ్యాన మందిర 14వ వార్షిక మహోత్సవాలు రెండో రోజు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం సాయినాథుడికి పంచామృతాభిషేకాలు, విభూదితో అభిషేకం, మండప ఆవాహన పూజలు, షిర్డీసాయి మూలమంత్ర జప హోమం, పూర్ణాహుతి జరిపారు. అభిషేకం అనంతరం ప్రత్యేక అలంకరణ, కాగడా హారతి ఇచ్చారు. సాయంత్రం సామూహిక సాయి సత్య వ్రతం నిర్వహించారు. 300 మహిళలు భక్తిశ్రద్ధలతో వ్రతం ఆచరించారు. పూజా సామగ్రిని ఆలయ కమిటీ ఉచితంగా అందజేసింది. శనివారం ఉదయం 1008 లడ్డూలతో సాయిబాబాకు అభిషేకం, మధ్యాహ్నం ఆలయం వద్ద 3 వేల మందికి మహా అన్నదానం, సాయంత్రం పురవీధుల్లో పల్లకీ సేవ ఉంటుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు బొడ్డేటి కిరణ్‌కుమార్‌ తెలిపారు. కమిటీ ఉపాధ్యక్షులు తోటపల్లి శ్రీనివాస్‌, ప్రగఢ జగన్నాథరావు, కార్యదర్శి పోలిపల్లి సూర్యారావు, కోశాధికారి తోటపల్లి వెంకట సూర్యనారాయణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

జాబ్‌ మేళాకు విశేష స్పందన


మాట్లాడుతున్న ఎంప్లాయిమెంట్‌ అధికారి

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్‌ కెరీర్‌ సర్వీస్‌ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన జాబ్‌ మేళాకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా జిల్లా ఎంప్లాయిమెంట్‌ అధికారి(టెక్నికల్‌) కె.సుధ మాట్లాడుతూ టైజియో టెక్నాలజీస్‌, శ్రీనిధి అసోసియేట్స్‌, ఆప్టెక్‌, ఫిన్‌కేర్‌ బ్యాంక్‌, యాక్సిస్‌ బ్యాంక్‌, రిలయన్స్‌ నిప్పాన్‌లైఫ్‌ ఇన్సూరెన్స్‌, రోవర్‌ ఐటీ టెక్నాలజీస్‌, సాయి మధు ఇంజినీరింగ్‌ అండ్‌ టెక్‌ సర్వీసెస్‌, కోజెంట్‌ ఈ–సర్వీసెస్‌ ప్రైవేటు లిమిటెడ్‌ కంపెనీల్లో 277 ఉద్యోగాల భర్తీకి జరిగిన ఇంటర్వ్యూలకు 347 మంది అభ్యర్థులు హాజరవగా.. 86 మంది ఎంపికైనట్లు తెలిపారు. రీజినల్‌ ఎంప్లాయిమెంట్‌ అధికారి సి.ఉమాదేవి, జిల్లా ఎంప్లాయిమెంటు అధికారి(క్లరికల్‌) సిహెచ్‌.సుబ్బిరెడ్డి, ఆయా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం తొలగింపు

సీతమ్మధార: జీవీఎంసీ 23, 24 వార్డుల పరిధి నక్కవానిపాలెం 60 ఫీట్‌ రోడ్డులో అనధికారికంగా నిర్మించిన 3వ అంతస్తును శుక్రవారం పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు తొలగించారు. ఏసీపీ వెంకటేశ్వర ఆదేశాల మేరకు టీపీఎస్‌ తేజేశ్వరరావు ఆధ్వర్యంలో చైన్‌మెన్లు, సిబ్బంది చర్యలు చేపట్టారు.

ప్లాస్టిక్‌ సంచులు వాడొద్దు


సీతమ్మధార రైతుబజార్‌లో అవగాహన కల్పిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ సత్యనారాయణ

సీతమ్మధార: ప్లాస్టిక్‌ సంచుల వాడకానికి స్వస్తి పలకాలని వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ సత్యనారాయణ పిలుపునిచ్చారు. సీతమ్మధార రైతుబజార్‌ ఆవరణలో శుక్రవారం రైతులు, వినియోగదారులు, స్ట్రీట్‌ వెండర్లకు ప్లాస్టిక్‌ సంచుల నిషేధంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్‌ బ్యాగుల వినియోగం వల్ల జరిగే నష్టాలపై వివరించారు. క్లాత్‌ బ్యాగులు వాడాలని సూచించారు. కార్యక్రమంలో రైతుబజార్‌ ఈవో కొండబాబు, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు
- 49వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం'


లబ్ధిదారుకు అభివాదం చేస్తున్న సమన్వయకర్త కె.కె.రాజు, కార్పొరేటర్‌ అల్లు శంకరరావు

మద్దిపాలెం: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని నెడ్‌క్యాప్‌ చైర్మన్‌, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 49వ వార్డులో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ ఫ్లోర్‌ లీడర్‌, కార్పొరేటర్‌ అల్లు శంకరరావుతో కలిసి ఆయన బర్మాక్యాంప్‌ కాలనీ, 282 సచివాలయం పరిధి పట్టాభిరెడ్డి గార్డెన్స్‌ ప్రాంతాల్లో పర్యటించారు. ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ఏదైనా సమస్య ఉంటే తెలుసుకుని పరిష్కరించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలా ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. గడిచిన నాలుగేళ్లుగా ప్రతి సమస్యను తక్షణమే పరిష్కరించి అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో యువజన విభాగం జోనల్‌ ఇన్‌చార్జి ఎం.సునీల్‌, డైరెక్టర్లు ఎస్‌.రవికుమార్‌, ఐ.రవికుమార్‌, రాయుడు శ్రీను, 49వ వార్డు నాయకులు కమలకుమారి, సరస్వతి, శకుంతల, మెర్సీ, ఢిల్లీరావు, చంద్రమౌళి, పావని, చైతన్య, శంకర్‌, ఈశ్వరరావు, మున్నా, హేమ, దేముడు, సీనియర్‌, షేక్‌ బాబ్జి, కర్రి రామారెడ్డి, కె.చిన్న, సబ్బవరపు శ్రీను, జీవీఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యుత్‌ సరఫరాకు నేడు అంతరాయం

సీతమ్మధార: ఆశీలమెట్ట సెక్షన్‌ ఆఫీస్‌ పరిధిలో ఎల్‌టీ లైన్ల మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్‌ సరఫరాకు అంతరాయం ఉంటుందని జోన్‌–1 ఈఈ జి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు సీతంపేట, గణేష్‌నగర్‌, అంబేడ్కర్‌ భవన్‌, తులసీపేట తదితర ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా ఉండదన్నారు.

శ్యామలాంబ ఆలయ నిర్వాహకుడిపై ఫిర్యాదులు

- గుడిని దేవదాయ శాఖ స్వాధీనం చేసుకోవాలని భక్తుల విజ్ఞప్తి
- బహిరంగ విచారణ చేపట్టిన ఏసీ శిరీష


ఆలయ హుండీకి సీల్‌ వేస్తున్న సిబ్బంది


విచారణ చేపడుతున్న దేవదాయ శాఖ అసిస్టెంట్‌ కమిషనర్‌ శిరీష

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు లలితానగర్‌లోని శ్యామలాంబ అమ్మవారి ఆలయాన్ని దేవదాయ శాఖ స్వాధీనం చేసుకోవాలని కొంతమంది భక్తులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. దీంతో దేవదాయ శాఖ అసిస్టెంట్‌ కమిషనర్‌ శిరీష శనివారం సాయంత్రం ఆలయం వద్ద బహిరంగ విచారణ చేపట్టారు. ప్రస్తుతం ఆలయాన్ని నిర్వహిస్తున్న ఏలూరి మురళి అనే వ్యక్తి పాత కమిటీని, ఆలయ వ్యవస్థాపకులను, పూజారిని దగ్గరకు రానీయకుండా, కమిటీ లేకుండా ఒక్కడే గుడి నిర్వహిస్తున్నాడని భక్తులు ఫిర్యాదు చేశారు. భక్తులు హుండీలో వేస్తున్న డబ్బులను ఏరోజు కారోజే ఇంటికి పట్టుకెళ్లి పోతున్నాడని, బంగారం, వెండి కానుకలు, అమ్మవారికి భక్తులు సమర్పిస్తున్న చీరలకు లెక్క లేదని, అమ్మవారికి కట్టే చీర రూ.10 వేల పైనే ఉండాలని, బిల్లుతో సైతం చీర ఇవ్వాలని షరతులు పెడుతున్నాడని ఆరోపించారు. అనంతరం చీరలు మళ్లీ ఆయా షాపులకే విక్రయిస్తున్నాడని అధికారి ముందు ఏకరవుపెట్టారు. అమ్మవారికి చీర చూపించాలంటే రూ.516, నీరు పొయ్యాలంటే డబ్బులు డిమాండ్‌ చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. హుండీ ఆదాయానికి, అన్నదానానికి వచ్చే విరాళాలకు లెక్క లేదని, అడిగితే బెదిరింపులకు దిగుతున్నాడని, గుడి ముందు రోడ్‌ను ఆక్రమించి షెడ్‌, స్వాగత బోర్డులు ఏర్పాటు చేయడం వల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోందన్నారు. ఆలయాన్ని మురళీ చేతుల నుంచి దేవదాయ శాఖ స్వాధీనం చేసుకుని, కొత్త కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు.

ఐదుగురితో నూతన కమిటీ..

ఏసీ శిరీష ఇరుపక్షాల నుంచి అభిప్రాయాలను, రాత పూర్వకంగా స్టేట్‌మెంట్స్‌ తీసుకున్నారు. సీసీ కెమెరాలు ఎందుకు ఏర్పాటు చేయలేదని మురళీని ప్రశ్నించారు. అవి ఉంటే ఎవరు ఏం చేస్తున్నారు తెలుస్తుందన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు ఇచ్చిన ఆదేశాలను ఎందుకు పాటించడం లేదన్నారు. ఆలయంలోని రెండు హుండీలను సీజ్‌ చేయించారు. స్థానికులు, భక్తులు, కమిటీ సభ్యుల వాదనలు విన్న తర్వాత ఐదుగురితో నూతన కమిటీ ఏర్పాటు చేశారు. శీల సన్యాసిరావు, జక్కంపూడి రమాదేవి, దేవేందర్‌, జగన్‌, మురళి కమిటీ సభ్యులుగా నియమించి, ఎటువంటి సంఘటనలు తలెత్తకుండా నడుచుకోవాలని వారికి ఏసీ శిరీష సూచించారు.

ముస్లింల సమస్యల పరిష్కారానికి కె.కె.రాజు చొరవ


కె.కె.రాజును సన్మానిస్తున్న ఫారూఖీ

సీతంపేట: ఉత్తర నియోజకవర్గంలోని పలు మసీదులు, ఈద్గాల సమస్యలను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనారిటీ విభాగం ప్రధాన కార్యదర్శి ఐ.హెచ్‌.ఫారూఖీ నెడ్‌క్యాప్‌ చైర్మన్‌, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన అక్కయ్యపాలెంలోని ఫారూఖీ కార్యాలయంలో శుక్రవారం ముస్లింల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. కలెక్టర్‌, సంబంధిత అధికారులతో ఫోన్‌లో సంభాషించి మసీదులు, ఈద్గాల సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం కె.కె.రాజును ఫారూఖీ సన్మానించారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా వక్ఫ్‌ బోర్డు చైర్మన్‌ కె.వి.బాబా, పార్టీ నాయకులు ఇబ్రహీం, నిజాం మసీదు కమిటీ పెద్దలు షరీఫ్‌, ఆసిఫ్‌ బాషా, అస్లాం, సలీం బాషా, అహ్మద్‌ బాషా పాల్గొన్నారు.